క్లుప్తంగా

సమైక్యతకు చిహ్నం.. కార్తీక వనభోజనం



కార్యక్రమంలో మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిరెడ్డి

పగిద్యాల: కార్తీక వనభోజనాలు సమైక్యతకు చిహ్నమని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కోట వీధిలోని ఉమామహేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన వన భోజనాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి, కార్తీక సోమవారం ఔషధ గుణం కలిగిన ఉసిరిక చెట్టు కింద వనభోజనాలు చేయడం శుభప్రదమని పురాణాలు చెబుతున్నాయన్నారు. కార్తీక వనభోజనాలు స్నేహాన్ని, సమైక్యతను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి, పీఠాధిపతులు రామ్మోహన్ స్వామి, మేడా సుబ్రహ్మణ్యం స్వామి, అవధూత రామితాత సంస్థాన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'ను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో కలసి స్పందన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని సింగరాజు పల్లె గ్రామానికి చెందిన రైతులు వారు సాగుచేసుకొన్న పంటలను కాపాడుకునేందుకు చెరువునుంచి నీటిని పెట్టుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు.

బీమా సాయం అందజేత

మిడుతూరు: మండల కేంద్రానికి చెందిన జమ్ముల మల్లికార్జున (47) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. వైఎస్సార్ బీమా కింద రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, గ్రామ ఉపసర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి చేతుల మీదుగా భార్య సావిత్రికి అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినోద్, వెల్ఫేర్ అసిస్టెంట్ మధు, మహిళా పోలీస్ శాంతి, వలంటీర్ హరిత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మ్యాట్ల పంపిణీ



మ్యాట్లు అందజేస్తున్న ఏఎస్‌ఐ శేషయ్య

మిడుతూరు: మండలపరిధిలోని కడుమూరు సెక్టార్‌లో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలకు రెండేసి చొప్పున 8 మ్యాట్లను కర్నూలు జిల్లా ఏపీ పోలీస్ సంఘం మాజీ అధ్యక్షుడు, నంద్యాల టూటౌన్ ఏఎస్‌ఐ వెంకట శేషయ్య సోమవారం పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు దాతలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మ్యాట్లను అందజేసిన ఏఎస్‌ఐని అంగన్‌వాడీ వర్కర్లు సన్మానించారు.

'ఆడుదాం ఆంధ్ర'పై అవగాహన



వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న స్పెషల్ ఆఫీసర్ పశు వైద్యాధికారి భాస్కర్

పాములపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వేంపెంట గ్రామ స్పెషల్ ఆఫీసర్ పశువైద్యాధికారి భాస్కర్ ఆధ్వర్యంలో వేంపెంట, బానకచెర్ల గ్రామ పంచాయతీల్లోని గ్రామ వలంటీర్లకు క్రీడాకారుల రిజిస్ట్రేషన్ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మాదన్న, పీఈటీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలు పెంచాలి

ఆత్మకూరు: అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి మంజుల, సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ కోరారు. పట్టణంలోని వివిధ సచివాలయాల వద్ద సోమవారం సచివాలయ ఉద్యోగులకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్‌కు గౌరవ వేతనం పెంచకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నెల 8 నుంచి అంగన్‌వాడీ వర్కర్లు, కార్యకర్తలు నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.



ఆత్మకూరు శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కొలనుభారతి సప్తశివాలయాల వద్ద సందడి చేస్తున్న భక్తులు



మహానందీశ్వర స్వామి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు



సంగమేశ్వరంలో పూజలు అందుకుంటున్న వేపదారు శివలింగం

కార్తీకం.. భక్తి పారవశ్యం

- కార్తీక సోమవారం సందర్భంగా కిటకిటలాడిన శివాలయాలు
- స్వామివారికి ప్రత్యేక పూజలు
- కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు



ఓంకారంలో ఉత్సవ మూర్తులను కల్యాణానికి తీసుకెళ్తున్న ఈఓ, ఆలయ కమిటీ సభ్యులు

మహానంది: కార్తీక మాసం, మూడవ సోమవారం సందర్భంగా మహానంది ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదిదేవుడికి ప్రీతికరమైన మాసం అవ్వడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు భక్తజన సంద్రంగా మారాయి. ఆలయానికి వచ్చిన భక్తులు కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి ముందుగా ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం, నంది స్థూపం, నాగులకట్ట ప్రాంగణాల్లో కార్తీక దీపాలు వెలిగించి శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, అర్చనలు చేశారు. ఆలయంలో ఉదయం నుంచి రద్దీ నెలకొంది. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి ఒకేరోజు సుమారు రూ. 12 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు ప్రాథమిక సమాచారం.

భక్తుల ఆకలి తీర్చడం పుణ్యఫలం:

మహానందీశ్వర స్వామి వారి దర్శనార్థం వచ్చిన భక్తుల ఆకలి తీర్చడం ఎంతో పుణ్యఫలం అని దేవస్థానం ఈఓ కాపు చంద్రశేఖరరెడ్డి, ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ కొనియాడారు. మండల కేంద్రమైన తిమ్మాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ నేత ఒంటెద్దు వీరారెడ్డి, వీర యూత్ మిత్ర బృందం ఆధ్వర్యంలో సోమవారం మహానందిలో వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. వారితో పాటు మహానందికి చెందిన గరుడ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక గరుడనంది ఆలయం వద్ద భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

భక్తులతో కిటకిటలాడిన ఓంకారం

బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన ఓంకారం ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కార్తీకమాసం మూడో సోమవారం పురస్కరించుకుని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తులు శ్రీ గంగా ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వర స్వామివారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి స్వామినారు దర్శనానికి విచ్చేయగా.. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఈఓ నాగప్రసాద్ ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేపట్టారు. అనంతరం అన్నప్రసాద కేంద్రం వద్ద అన్నప్రసాదాలు స్వీకరించి రుచికరంగా ఉన్నాయని కొనియాడారు.

వైభవంగా స్వామివారి కల్యాణ మహోత్సవం

శ్రీ గంగా ఉమా సమేత ఓంకార సిద్దేశ్వర స్వామివారికి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ నాగప్రసాద్, చైర్మన్ విశ్వనాథ రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వామి అమ్మవార్లకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకారపూజ, హారతులు, అక్షతల సమర్పణ, మాంగళ్య ధారణ, కళ్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

రుద్రకోడూరులో విశేషపూజలు

ఆత్మకూరు: నల్లమల అటవీపరిధిలో రుద్రకోడూరు క్షేత్రంలో కార్తీక సోమవారం సందర్భంగా శ్రీరుద్ర కోటేశ్వర, రుద్రాణిమాతకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామిఅమ్మవార్లకు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. రాత్రి భజన కార్యక్రమాలు చేపట్టారు. క్షేత్రానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ పురోహితులు నల్లగుంట్ల నారాయణ తెలిపారు. అలాగే ఆత్మకూరు పట్టణంలోని అన్ని శివాలయాలతో పాటు అంబాభవాని, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి, శ్రీసాయిబాబా దేవాలయం, శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో కార్తీకసోమవారం సందర్భంగా భక్తుల పెద్ద సంఖ్యలో దర్శించి పూజలునిర్వహించారు.



ఓంకారంలో అన్న ప్రసాదాలు స్వీకరిస్తున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, నాయకులు

సంగమేశ్వరంలో భక్తుల సందడి

కొత్తపల్లి: కార్తీక సోమవారం కావడంతో సంగమేశ్వరం, కొలనుభారతి క్షేత్రాలలో భక్తులు సందడి చేశారు. కొలనుభారతి దేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకఅలంకరణలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అక్కడే ఉన్న సప్తశివాలయాల్లో భక్తులు విశేష పూజలు చేసుకున్నారు. సంగమేశ్వరంలో ప్రాంగణంలోని నీటిని, బురదను ట్రాక్టర్ డోజర్‌తో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో శుభ్రం చేయించారు. వేపధారు శివలింగాని ప్రత్యేక పూజలు చేశారు.

సంగమేశ్వరం అభివృద్ధికి కృషి

సంగమేశ్వరం క్షేత్ర అభివృద్ధికి ప్రత్యేక కృషిచేస్తానని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, ఎర్రమఠం సర్పంచు బాల ఎల్లయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం సంగమేశ్వర ఆలయాన్ని సందర్శించి వేపదారు శివలింగానికి విశేష పూజలు నిర్వహించుకున్నారు.

తుపాను పట్ల అప్రమత్తంగా ఉండండి

జూపాడుబంగ్లా: మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ హెచ్చరించారు. పంట నూర్పిళ్లు చేసుకుంటున్న రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షంతాకిడి ప్రారంభమైనప్పటి నుంచి ప్రజలు ఇళ్లల్లోంచి బయటకు వెళ్లరాదని సూచించారు. పాతమిద్దెల్లో నివాసం ఉంటున్న వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా వెంటనే సమాచారం ఇవ్వాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల మంగళ, బుధవారాల్లో గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. రైతులు ఖరీఫ్‌లో సాగుచేసిన వరి, మిరప, మొక్కజొన్న కోతదశలో ఉంటే వర్ష ప్రభావ సూచనలు తగ్గిన తర్వాత కోసుకోవాలని సూచించారు. అలాగే పంటలు నూర్పిడి చేసుకుంటున్న రైతులు వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకోవటానికి వెంటనే వాటిని బస్తాల్లోకి ఎత్తుకొని గోదాముల్లో భద్రపర్చుకోవాలన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత



ఆధ్యాత్మిక గ్రంథాలను పంపిణీ చేస్తున్న జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు

పాములపాడు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత గ్రంథములు చదవడం వలన మానసిక ప్రశాంతతను పొందుతారని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక చింతలపల్లి, ఆత్మకూరు కమిటీ అధ్యక్షుడు రామచంద్రుడు అన్నారు. సోమవారం మండలంలోని మద్దూరు, క్రిష్ణానగర్, పెంచికలపల్లి గ్రామాల్లో త్రైత సిద్ధాత భగవద్గీత అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథముల పరిచయ, ప్రచార కార్యక్రమము నిర్వహించారు. కార్తీక మాసంలో ఆచరించాల్సిన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఆ కమిటీ సభ్యులు కుమార్ ఆచారి, నాగమద్దిలేటి, సంజీవ, పార్థసారథి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో మంత్రి అప్పలరాజు



స్వామిఅమ్మవార్ల దర్శనార్థం వస్తున్న మంత్రి అప్పలరాజు



ఆలయ ప్రాంగణంలో ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డివిజి శంకరరావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల దర్శనార్థం ఆదివారం రాత్రి శ్రీశైలం చేరుకున్న ఏపీమత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి డా. సిదిరి అప్పలరాజు సోమవారం వేకువజామున స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్లశేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. అదేవిధంగా స్వామి,అమ్మవార్లను ఆంధ్రప్రదేశ్ ఏస్టీ కమిషన్ చైర్మన్ డా.విడిజి శంకరరావు దర్శించుకున్నారు.

జగనన్నతోనే ప్రజా సంక్షేమం



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రభుత్వ పథకాలు సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు కురుకుంద శంకర్‌రెడ్డి, జేసీఎస్ అధ్యక్షులు పుల్లారెడ్డి అన్నారు. మండలంలోని కురుకుంద గ్రామంలో సచివాలయం–2 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభివృద్ధి కోసం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా నవరత్న పథకాలు అందించారన్నారు. కురుకుంద సచివాలయం పరిధిలోని కొట్టాలచెర్వు గ్రామానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.10,45,48,528 లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమఅయ్యిందని చెప్పారు. కార్యక్రమంలో కొట్టాలచెర్వు సర్పంచ్ నాగలక్ష్మి, కురుకుంద సర్పంచ్ మహబూబ్‌బీ, ఎంపీటీసీలు రాజలక్ష్మి, అబ్దుల్‌కలాం తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే పంట నష్టం ఉండదు



ఆర్‌బీకేలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ పవన్ కుమార్

వెలుగోడు: తుపాను సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తే పంట నష్టం ఉండదని వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. సోమవారం వెలుగోడు 3వ రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కియోస్క్ పనితీరు, రబీ పంట నమోదు వివరాలు పరిశీలించారు. మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో పలు సూచనలు చేశారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. వరి ధాన్యం గట్టిగా, కోతకు సిద్ధంగా ఉన్నప్పుడు, వెంటనే ధాన్యాన్ని కోయడానికి, వర్షం నుంచి తడవకుండా సురక్షిత ప్రాంతానికి రవాణా చేయడానికి కంబైన్డ్ హార్వెస్టర్‌ను ఉపయోగించాలన్నారు. దిగుబడులు తడవకుండా కవర్ చేయడానికి తగినన్ని టార్పాలిన్, పాలిథిన్ షీట్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా, నిలిచిన నీరు సులభంగా బయటకు పోవడానికి వాలుకు అడ్డంగా గట్లు వేయాలన్నారు. పత్తి పంటను తెరిచిన బోల్స్ నుంచి కోయాలని, తడి చేయకుండా వెంటనే రవాణా చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ సుధారాణి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది నాగమణి, పలువురు రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన వాయిదా

శ్రీశైలంటెంపుల్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు శ్రీశైలం పర్యటన వర్షం కారణంగా రద్దయ్యింది. మంగళవారం చంద్రబాబు శ్రీశైలం చేరుకుని శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను దర్శించుకోవాలని నిర్ణయించారు. అయితే రాష్ట్రంలో రెండు రోజుల పాటు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఆయన తన పర్యటనను వాయిదా వేసుకున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

ఇతిహాసాలు మార్గదర్శకాలు

మహానంది: ఇతిహాసాలు మానవ జీవనానికి మార్గదర్శకాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ నాగభూపాల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ఎం. తిమ్మాపురం గ్రామంలో సోమవారం భక్తులకు రామాయణం గ్రంథాలు పంపిణీ చేశారు. నంద్యాల ఇస్కాన్ వారి సహకారంతో గ్రామానికి చెందిన పగడాల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు రఘుకుమార్ శర్మ పాల్గొన్నారు.

నల్లమల ఘాట్‌లో పునుగుపిల్లి మృతి

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్ రోడ్డు గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ పునుగుపిల్లి మరణించింది. ఆదివారం రాత్రి రోడ్డు దాటుతున్న సమయంలో ఈ అరుదైన వన్యప్రాణి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇదిలా ఉంటే కొందరు పులిపిల్ల మరణించినట్లుగా ప్రచారం చేయడం చర్చనీయాంశంగా మారింది.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



షికారీపేటలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీఓ శివారెడ్డి



శివపురంగూడెంలో విద్యార్థుల వివరాలను సేకరిస్తున్న డీటీడబ్ల్యూఓ శివప్రసాద్

నందికొట్కూరు: బడి ఈడు పిల్లలను బడికి పంపితే రాష్ట్ర ప్రభుత్వమే పైసా ఖర్చు లేకుండా చదివిస్తుందని నంద్యాల ఆర్టీఓ శివారెడ్డి అన్నారు. సోమ వారం పట్టణంలోని షికారిపేటలోని ప్రాథమిక పాఠశాలను, ఉర్దూ ప్రాథమిక పాఠశాలను జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేశారు. పాఠశాలల పరిస్థితిని పరిశీలించారు. షికారిపేటలోని తల్లిదండ్రులకు పిల్లలను బడికి పంపాలని అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. మున్సిపల్ కమిషనర్ కిషోర్, ఎంఈఓ ఫైజున్నీసాబేగం, తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలలో బడి ఈడు పిల్లలను వారి తల్లి దండ్రులు బడిలో చేర్పించాలని జిల్లా డీపీఓ మంజులవాణి సూచించారు. సోమవారం మండలంలోని బ్రాహ్మణకొట్కూరులో జరుగుతున్న జీఈఆర్ సర్వేను పరిశీలించారు.

బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలకు పంపండి

ఆత్మకూరు: డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లోని గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలకు పంపాలని ఆత్మకూరు ఆర్డీఓ దాస్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆత్మకూరు, నందికొట్కూరు నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాలకు చెందిన వలంటీర్లు, రెవెన్యూ ఉద్యోగులు బడి ఈడు పిల్లలను, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాలన్నారు. మంగళ, బుధవారాల్లో వలంటీర్లతో పాటు రెవెన్యూ అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఈఓఆర్డీఓలు గ్రామాల్లో తిరిగి బడి బయట పిల్లలను గుర్తించాలని ఆదేశించారు. తల్లితండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను పాఠశాలకు పంపే విధంగా కృషి చేయాలన్నారు.

పగిద్యాల: బడి ఈడు పిల్లలు అందరూ బడిలో ఉండాలని ఎంపీడీఓ వెంకటరమణ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం విద్యాధికారి సుభాన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

మిడుతూరు: బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ జీఎస్‌రెడ్డి, తహసిల్దార్ ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయం విద్యార్థినులచే గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. బస్టాండులో మానవహారంగా నిలిచి ప్రతిజ్ఞ చేశారు.

జూపాడుబంగ్లా: బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి, ఇంటర్‌బోర్డు ఆర్‌ఐఓ గురువయ్యశెట్టి తెలిపారు. సోమవారం మండలకేంద్రమైన జూపాడుబంగ్లాలో ఎంపీడీఓ నూర్జహాన్, ఎంఈఓ–1 చిన్నమద్దిలేటి, సచివాలయ ఉద్యోగులు, సీఆర్పీలు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి లాంగ్ ఆబ్సెంట్స్ అయిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. వెంటనే వి ద్యార్థులను బడికి పంపించాలని అవగాహన కల్పించారు.

పగిద్యాల: పౌరసరఫరా శాఖ డీఎం రాజునాయక్ మండలంలోని పాలమర్రి, కొత్త ముచ్చుమర్రి గ్రామాల్లో ఆయన దాదాపు 30 ఇళ్ల చొప్పున ఇంటింటి సర్వే చేశారు. 5 ఏళ్ల వయస్సు నుంచి 18 ఏళ్ల వయస్సు పిల్లలందరూ బడిలో ఉన్నారా లేదా అంటూ కుటుంబ సభ్యులను విచారించారు.

నిరక్షరాస్యతను రూపుమాపడమే ప్రభుత్వ లక్ష్యం

కొత్తపల్లి: నిరక్షరాస్యతను రూపుమాపడమే ప్రభుత్వం లక్ష్యమని డిస్ట్రిక్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ శివప్రసాద్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని శివపురం గూడెం, ఎం.లింగాపురం, కొత్తపల్లి గ్రామాలలో ఎంపీడీఓ మేరి, ఎంఈఓ శ్రీరాములుతో కలిసి పర్యటించారు. మండలంలో 100 శాతం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

- వేడుకల్లో పాల్గొన్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి దంపతులు



గర్భగుడిలో ప్రతిష్ఠించిన విగ్రహాలు



విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి దంపతులు

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం శ్రీసీతారామలక్ష్మణాంజనేయ స్వామివార్ల విగ్రహాల ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాలను పఠిస్తుండగా టీటీడీ ఈఓ ధర్మారెడ్డి దంపతులు విగ్రహాలను ప్రతిష్ఠించారు. ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా రెండోరోజు టీటీడీ అర్చకులు వేదమంత్రాలను పఠిస్తూ విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలోని గర్భగుడిలో ప్రతిష్ఠించిన విగ్రహాలకు ఈనెల 6న ప్రాణప్రతిష్ఠ నిర్వహించటంతో పాటు ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీసీతారాముల వారి కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నర్రెద్దుల శ్రీనివాస రెడ్డి, తర్తూరు సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, దేవదాయశాఖ ఈఓ వెంకటరమణ తెలిపారు.

బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు

జూపాడుబంగ్లా: ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం రాత్రి స్థానిక పోలీసుస్టేషన్‌కు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కృష్ణరావుపేటకు చెందిన రమేష్ నందికొట్కూరు నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. కర్నూలు స్వామిదాసు ఫైనాన్స్‌లో పనిచేస్తున్న కర్నూలుకు చెందిన వీరా, కనకయ్యకొట్టాలకు చెందిన రామాంజనేయులు ద్విచక్రవాహనంపై కర్నూలుకు బయలుదేరారు. వీరిద్దరు జూపాడుబంగ్లా విద్యుత్ ఉపకేంద్రం సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా వారిని 108లో నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. ఎస్‌ఐ మారుతిశంకర్ ఘటనా ప్రాంతానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి..

మిడుతూరు: స్థానిక బీసీ కాలనీకి చెందిన శ్రీకాంత్ కల్లు సేవించి తన ద్విచక్ర వాహనంపై నాగలూటి నుంచి మిడుతూరు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో సైడ్ తగిలింది. దీంతో బైక్ అదుపుతప్పి రహదారి పక్కన గుంతలో పడటంతో శ్రీకాంత్ తలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో కర్నూలుకు తరలించారు.